


హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి అత్యవసర సేవలు అందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు సిబ్బందికి సూచించారు. మాతృ, శిశు మరణాలపై గురువారం వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 23 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 24వరకు జిల్లాలో 3 మాతృ మరణాలు, 6/37 శిశు మరణాలపై సమీక్షించారు. హైరిస్క్ గర్భిణి కేసులు గుర్తించి వారి సేవలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ గౌరీ శంకర్, జిఎంసిహెచ్ఒడి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ శుభ, అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్.సుజాత దేవి, డాక్టర్ సత్యనారాయణ, సిడిపిఒ జి.ప్రసన్న, డాక్టర్ జి.శశిభూషణరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యనారాయణ పిహెచ్‌సిల వైద్యాధికారులు, ఇతర పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎసిబికి పట్టుబడిన డిటి శ్రీనివాసరావు

ఎసిబికి చిక్కిన డిటి


- రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

విజయనగరం మండల ఉప తహశీల్దార్ కొట్నాన శ్రీనివాసరావు గురువారం ఓ వ్యక్తి నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. నగరంలోని నోబుల్ నగర్‌కు చెందిన మురళీ అనే వ్యక్తి తన 150 గజాల ఇంటి స్థలానికి సంబంధించి సర్వే నెంబరు అండార్సుమెంట్ కోసం తహశీల్దార్ అధికారులను ఆశ్రయించాడు. అయితే ఈ పనిచేసేందుకు డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసరావు రూ.10వేలు డిమాండ్ చేయడంతో స్థల యజమాని మురళి ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలో దిగిన ఎసిబి అధికారులు మురళీ నుంచి శ్రీనివాసరావు రూ10.వేలు లంచం తీసుకుంటుండగా నేరుగా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి వి.రామచంద్రరావు ఆధ్వర్యాన జరిగిన ఈ దాడిలో ఎసిబి అధికారులు పాల్గొన్నారు. డిటిపై కేసు నమోదు చేసి ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

అయోమయంలో వైసిపి కేడర్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ముఖ్యంగా వైసిపి కేడర్ ఎన్నికల వేళ అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా భవనాలు, రోడ్ల నిర్మాణ బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపిటిసి, ద్వితీయ శ్రేణి నాయకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మరోవైపు సచివాలయాల పవర్ అంతా కార్యదర్శుల చేతుల్లో పెట్టడం వల్ల స్థానిక సంస్థల ప్రతినిధుల పాత్ర నామమాత్రంగా మారింది. ఇంకోవైపు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్ల గ్రామాల్లో పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాటినీటి సదుపాయం తదితరాలు కష్టతరంగా మారాయి. ఈనేపథ్యంలో నాయకుల్లో వైసిపి ప్రభుత్వంపై తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తమౌతోంది. ప్రస్తుత ఎన్నికల్లో ఈ ప్రభావం అధికార పార్టీపై తప్పక ఉంటుందని పలువురు విశ్లేషిస్తున్నారు.



- ఆర్థిక ఇబ్బందుల్లో సర్పంచులు, ద్వితీయ శ్రేణి నాయకులు
- వాలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రమేయం లేకుండానే సంక్షేమ పథకాలు
- ఆర్థిక సంఘం నిధులూ లేక పారిశుధ్యం, వీధిదీపాలు కల్పించలేని దుస్థితి
- ఎన్నికల్లో వీరిపాత్ర ఎలా ఉంటుందో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, బల్క్‌మిల్క్ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్‌లో నిర్మాణాలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇవన్నీ వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, లేదా ఆ పార్టీకి చెందిన నాయకులే కాంట్రాక్టు తీసుకుని నిర్మాణ పనులు చేపట్టారు. ఉపాధి హామీ ద్వారా వచ్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధుల నుంచి వీటికి చెల్లింపులు చేయాల్సివుంది. కేంద్రం సక్రమంగా చెల్లించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం నిలదీయలేదు. కొన్ని సందర్భాల్లో విడుదలైన నిధులను ఇతర అవసరాలకు దారి మళ్లించిందనే విమర్శలు ఉన్నాయి. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ భవన నిర్మాణ పనులకు విజయనగరం జిల్లాలో రూ.28 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.10కోట్ల మేర బకాయి ఉంది. నాడు-నేడు పనుల బిల్లులు కూడా ఒక్క విజయనగరం జిల్లాలోనే రూ.7కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం వైసిపి గ్రామ స్థాయి నాయకులు, సర్పంచులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. వడ్డీలు కూడా చెల్లించుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కక్కలేక మింగలేక అన్నట్టు పార్టీని సమర్థించలేక, అలాగని వదులకోలేక సతమతమౌతున్నామని చెప్తున్నారు. వివిధ రూపాల్లో ప్రజల నుంచి పన్ను వసూలు చేస్తున్నందున రాజ్యాంగం ప్రకారం సగటు మనిషికి రూ.8చొప్పున పంచాయతీలకు, రూ.4 చొప్పున మండల, జిల్లా పరిషత్తులకు కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సివుంది. ఈలెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు రూ.కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాల్సివున్నప్పటికీ సరిగా విడుదల కాలేదు. దీంతో, తాగునీటి మోటార్ల విద్యుత్ ఛార్జీల చెల్లింపునకు పంచాయతీలు కటకటలాడు తున్నాయి. వేసవిలో తాగునీటి పథకాల నిర్వహణ, నీటి సరఫరా భారంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. పారిశుధ్య కార్మికులు (గ్రీన్ అంబాసడర్లు)కు వేతనాలు చెల్లించలేని దుస్థితి దాపురిస్తోంది. ఇలా ఒకటేమిటి కేంద్ర ప్రభుత్వ వైఖరితో స్థానిక సంస్థల మనుగడ దినదిన గండంగా మారింది. గ్రామ స్థాయిలో సర్పంచులు, నాయకులు నిలదీతలు, చీదరింపులకు గురి కావాల్సిన దుస్థితి ఏర్పడింది. సచివాలయాల నిర్వహణ, సంక్షేమ పథకాల మంజూరు కూడా తమకు సంబంధం లేకుండానే సాగిపోతోందంటూ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వాపోతున్నారు. ఇలా వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, పట్టణాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఓవైపు బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సదుపాయాలు కల్పించలేని పరిస్థితి, ఇంకోవైపు పథకాల మంజూరుకు పరపతి కూడా లేకుండా పోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈనేపథ్యంలో వీరు ఎన్నికల్లో వైసిపి విజయానికి ఏమేరకు తోడ్పాటునందిస్తారు? ఒకవేళ పార్టీ విజయానికి కృషి చేసినా ప్రజల మన్ననలు ఎంత వరకు పొందుతారు? అన్నదానిపై రాజకీయ నాయకులతోపాటు సాధారణ ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న
15 మంది వాలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం/పాచిపెంట

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 15 మంది వాలంటీర్లను అధికారులు తొలగించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పాంచాలి గ్రామంలో ఈనెల 19న 11 మంది వాలంటీర్లు రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఫిర్యాదులు రావడంతో వారిని సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు తొలగించినట్లు ఎంపిడిఒ లక్ష్మీకాంత్ తెలిపారు. ప్రధానంగా పార్టీ కార్యకలాపాల్లో వాలంటీర్లు పాల్గొన్నారని ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన వాట్సాప్‌కు ఫోటోలను టిడిపి నాయకులు పంపించడంతో ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు తెలిపారు.

ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గం ఎస్.కోట మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అలుగుబిల్లి గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామ వాలంటీర్లు బత్తుల కృష్ణ, బోనెల మనోజ్ కుమార్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. వీరిద్దరూ స్థానిక శాసనసభ్యునితో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు వచ్చిన ఫిర్యాదులపై అక్కడి రిటర్నింగ్ అధికారి విచారణ జరిపి, వారిపై వచ్చిన ఆరోపణలు నిర్ధారిస్తూ నివేదిక అందజేయడంతో చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గరివిడి మండలం చుక్కవలస కు చెందిన ఇద్దరు వాలంటీర్‌లను విధుల నుంచి తొలగించినట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వాలంటీర్ లు కిల్లాన ప్రసాద్, రేవళ్ళ త్రినాధ్ లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు ఫిర్యాదులు అందాయని, వీటిపై విచారణ జరిపి నివేదిక అందిన మీదట విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

లీగల్ మెట్రాలజీ శాఖ ప్రత్యేక దాడులు

విజయనగరం టౌన్ : గల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ బి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో రాజాం, చీపురుపల్లిలో గురువారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. కమిషన్ ఏజెంట్లు, రైతు బజార్లు, సంతలు, పండ్లు/కూరగాయలు, యం.యల్. యస్ పాయింట్లు, ఇతర వ్యాపార సంస్థలపై ప్రత్యేకదాడులు నిర్వహించి 14 కేసులు నమోదు చేశారు. దాడుల్లో అసిస్టెంట్ కంట్రోలర్ పివి రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్ యం. దామోదర నాయుడు, ఎ.బలరామ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ బి. సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇక చెప్పడాలుండవ్... చర్యలే

- కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలి
- ఇంటింటి ప్రచారానికీ అనుమతి తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనపై దృష్టిపెట్టి కేసులు నమోదు చేయాలని సూచించారు. నిర్లిప్తతను విడనాడాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడ్ అమల్లోకి వచ్చి ఇప్పటికే 72 గంటలు గడువు దాటిపోయిందని, నిబంధనలను అమలు చేయనివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు అధికారులు, ఎంసిసి బృందాలు, ఇతర ఎన్నికల సిబ్బందితో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పి దీపిక గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నమోదైన కొన్ని సంఘటనలపై క్షేత్రస్థాయి అధికారులనుంచి తమకు ఇంతవరకు సమాచారం రాకపోవడం పట్ల నిలదీశారు. ఇకనుంచీ ఇలాంటి సంఘటనలను సహించేది లేదన్నారు. ఎన్నికల నియమావళిని అమలు చేయడానికి సాధారణ అధికారులతోపాటు, పోలీసు సిబ్బందిని కూడా నియమించామని, వీరంతా పరస్పరం సమన్వయంతో, మరింత క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించారు. ఎట్టిపరిస్థితిలోనూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకూడదని, జరిగితే తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కోడ్ ఉల్లంఘన సంఘటనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎంసిసి, ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల బృందాలు సంబంధిత ఆర్ఒ కిందనే పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఎన్నికలకు సంబంధించి సువిధ వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా మాత్రమే అనుమతులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచారం, వాహనాలు తదితర అన్నిటికీ అనుమతులు అవసరమని తెలిపారు. దరఖాస్తు చేసిన వెంటనే వీలైనంత త్వరగా అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. తాత్కాలిక పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయాలంటే అనుమతి తప్పనిసరి అని, ఆ ఇంటి యజమాని నుంచి అంగీకార పత్రం ఉండాలని చెప్పారు. ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరిగే ప్రచార ఖర్చులు పార్టీ ఖాతాలోకి వెళ్తాయని, నామినేషన్ వేసిన తరువాత చేసే ఖర్చు అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తారని తెలిపారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులు కొనసాగుతాయని, కొత్తగా పనులు మంజూరు కానీ, ప్రారంభం కానీ జరగకూడదని తెలిపారు. నిబంధనలను అతిక్రమించే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలుంటాయని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఇతర ఉద్యోగులను పూర్తిగా విధులనుంచి తొలగిస్తామని తెలిపారు.

జిల్లా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ, ఎంసిసికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ చేయాలన్నారు. ఏమాత్రం ఉల్లంఘన జరిగినా కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అనుమతులు లేని కార్యక్రమాలను, ఎంసిసి ఉల్లంఘనలను ఫొటోలు, వీడియోలు తీసి, కేసు నమోదు చేయాలని ఎస్‌పి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, నోడల్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

కూటమిని ప్రజలు నమ్మరు

ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స

ప్రజాశక్తి-గుర్ల

టిడిపి, జనసేన,బిజెపి కూటమిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రతి కుటుంబానికి మంచి జరిగిందని నమ్మితేనే తనను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపిగా గెలిపించాలని కోరారు. మండలంలోని ఎస్ఎస్ఆర్ పేటలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి వైసిపి ప్రభుత్వ హయాంలోనే సాధ్యమైందన్నారు. వైసిపీ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే మరింత సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు. ఈ నియోజక వర్గం ప్రజలు డబ్బులు ఇస్తే లొంగి పోతారని ప్రచారం జరుగుతుందని, ఆ మాటను ఇక్కడ ప్రజలు తిప్పి కొట్టాలని అన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా అభివృద్ధికే పట్టం కడతారని అన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యాయని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉధృత పోరాటం


ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసన గురువారినికి 51వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ గత 51రోజులుగా మిమ్స్ ఉద్యోగులు 7 డిఎ బకాయిలు ఇవ్వాలని, వేతన ఒప్పందం చేయాలని, వేధింపులు, కక్ష పూరిత బదిలీలు నిలిపివేసి, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల గోడును పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ యంత్రాంగం కూడా కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తున్న మిమ్స్ యాజమాన్యానికి వత్తాసు పలకడం భావ్యం కాదన్నారు. ఎంతటి పోరాటానికైనా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు సిద్ధంగా ఉన్నారని, బెదిరింపులు, ప్రలోభాలకు లొంగే ప్రసక్తి లేదని అన్నారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలని కోరారు. చర్చలు విఫలమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మిమ్స్ యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు మిరప నారాయణ, కర్రోతు కాము నాయుడు, కొమ్మూరి మధు, మహంతి నాగ భూషణం, బెల్లాన బంగారు నాయుడు, గౌరి,మూర్తి, మహంతి రాంబాబు, అప్పల నాయుడు, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ



డిప్యూటీ సిఎంను కలిసిన తనూజ

డిప్యూటీ సిఎంను కలిసిన ఎమ్‌పి అభ్యర్థి తనూజ

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను గురువారం అరుకు ఎంపి అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజ రాణి కలిశారు. ఆమె భర్త, వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శెట్టి వినయ్‌తో కలిసి రాజన్నదొరను ఆయన నివాసంలో కలిశారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ఎంపిఅభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో తన గెలుపు కోసం కృషి చేయాలని వారు కోరారు. ఆమె రాజన్నదొరకు పుష్పగుచ్చం అందజేసి ఆశీస్సులు అందుకున్నారు. రాజన్నదొర తనూజా రాణికి దుశ్శాలువాతో సన్మానించారు.

అక్కడే ఉన్న వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, గొర్లి జగన్మోహన్ రావు, జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావును ఆమెకు పరిచయం చేశారు.

కార్పొరేషన్ల రుణాలేవీ?

- బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యం
- ఐదేళ్లలో ఉపాధి రుణాలకు పూర్తిగా తిలోదకాలు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెనుబడిన కులాలకు ఆర్థికంగా అండగా నిలవాల్సిన కార్పొరేషన్లు నిర్వీర్యమైపోయాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవుల పంపకం చేపట్టినప్పటికీ ఆ కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక తరగతుతులకు ఎటువంటి రుణాలూ ఇవ్వలేదు. గత ఐదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే ఉపాధి రుణాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బిసి, ఎస్‌సి, ఎసిటి, మైనార్టీలకు తీరని నష్టం జరిగింది. సంక్షేమ పథకాల సొమ్మునే సామాజిక తరగతులవారీగా ప్రభుత్వం లెక్కలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు 25 లక్షల జనాభా ఉన్నారు. వీరిలో బిసి జనాభా దాదాపు 50 శాతం వరకూ ఉండగా, ఎస్‌సి జనాభా 15 నుంచి 18 శాతం మధ్య, ఎస్‌టి జనాభా 2 శాతం, ముస్లిం 2 శాతం లోపు, క్రిస్టియన్ జనాభా 2 శాతం ఉన్నారు. గత ప్రభుత్వాల పాలనలో కార్పొరేషన్ల నుంచి ఆయా తరగతుల ప్రజలకు పెద్దఎత్తున ఉపాధి రుణాలు అందించేవారు. రూ.రెండు లక్షల రుణం అందిస్తే రూ. లక్ష సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చేది. రూ. లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. రుణం తీసుకున్న లబ్ధిదారులు కచ్చితంగా ఏదోక ఉపాధి పొందుతున్నట్లు చూపించాల్సి ఉండేది. కిరాణా దుకాణాలు, పాడి పరిశ్రమ, వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకుని కార్పొరేషన్ల రుణాలతో ఎన్నో కుటుంబాలు ఉపాధి పొందేవి. ఇవికాకుండా రూ.20 లక్షల ఖరీదు చేసే కార్లను సైతం కార్పొరేషన్ల ద్వారా అందించేవారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేవారు. కారు నడుపుకుంటూ ప్రతినెలా బ్యాంకులకు వాయిదాలు చెల్లిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. కార్పొరేషన్ల రుణ వితరణలో ప్రత్యేక విభాగం నిరంతరం పనిచేసేది. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇదే ఒరవడి ఉండేది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్పొరేషన్ల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 50 కార్పొరేషన్లుగా విస్తరించి ఛైర్మన్లను నియమించినప్పటికీ జనానికి ఉపయోగపడని పరిస్థితి ఉంది. గత ఐదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా ఏఒక్క కుటుంబానికి ఉపాధి లభించని పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో 70 శాతానికిపైగా ఉన్న వెనుకబడిన సామాజిక తరగతుల ప్రజానీకానికి స్వయం ఉపాధి అవకాశాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. అందరికీ అందించే అమ్మఒడి, చేయూత, పెన్షన్లు వంటి పథకాల సొమ్మును ఆయా సామాజిక తరగతులకు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చూపించడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలకు ఇచ్చిన సొమ్ముకు, కార్పొరేషన్ల రుణాలకు ఏవిధంగా పోలికపెడతారని ఆయా సామాజిక తరగతుల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ల ద్వారా రుణాలందిస్తే చదువుకున్న ఎంతోమందికి ఉపాధి లభించి జీవితంలో నిలదొక్కుకునే వారమని, అటువంటి పరిస్థితి లేకుండాపోయిందని నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలేవీ ఈ విధంగా చేయలేదనే చర్చ నడుస్తోంది. ఎన్నికల తరుణంలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ల అంశం చర్చ నీయాంశంగా మారింది.



కొమరాడ: నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ధాన్యం రైతులు

ధాన్యం డబ్బులు జమచేయకపోతే ఉద్యమం

ప్రజాశక్తి - కొమరాడ

ఈ నెల 26వ తేదీ లోపు రైతులు ఖాతాలో ధాన్యం డబ్బులు జమ చేయకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన, ఉద్యమం చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమచేయాలని కోరుతూ మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీ సెంటర్ వద్ద గురువారం రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి కష్టపడి అప్పులు చేసి ధాన్యాన్ని పండించి ప్రభుత్వానికి అమ్మితే ఇప్పటికి 56 రోజులు కావస్తున్నా ఇంత వరకూ రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వేయలేదన్నారు. దీంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహించారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు వారాల్లోనే డబ్బులు వేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వేయకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించకుంటే నిరసన

జియ్యమ్మవలస: రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం 21 రోజుల్లో రైతు ఖాతాలకు డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి నేటికి రెండు నెలలు కావస్తున్నా ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మన్యం జిల్లాలో 4వేల మంది రైతులకు చెందిన రూ.48.25 కోట్లు ధాన్యం బకాయిలు ఉన్నాయని వీటిని సోమవారంలోగా చెల్లించకుంటే రైతులతో కలిసి ఎన్నికల నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల సహకారం తీసుకుని నిరవధిక నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బడే స్వామి నాయుడు, లచ్చిరెడ్డి సత్యనారాయణ, దత్తి చంద్రమౌళి, పల్ల వెంకట నాయుడు, రంభ కృష్ణమూర్తి నాయుడు, గుణుపూరు వెంకట నాయుడు తదితర రైతులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఒడిశాతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి ఆంధ్రా సరిహద్దులలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని కచ్చితంగా వివరాలను నమోదు చేసి తనిఖీ చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత పోలీసులకు సూచించారు. గురువారం మండలంలోని రావికోన పంచాయతీ, బట్టి వలస, ఆదారు గ్రామాల దగ్గర ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి వాహన రవాణాపై నిఘా ఉంచాలని అధిక నగదు మాదకద్రవ్యాలతో పాటు ఇతర నిషేధిత వస్తువులు వాహనాలలో ఉంటే వెంటనే అదుపులోకి తీసుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని, పోలీసు కేసులు నమోదు చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆర్‌డిఒ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.హేమలత అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికల విధులు భాగంగా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు గురువారం తన కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సెక్టార్ ఆఫీసర్లకు కూడా ఎన్నికల విధులపై తగు సూచనలు ఇచ్చారు. ఈ అవగాహన సదస్సులో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, తహసీల్దార్లు, ఎ.ఆనందరావు, ఎ.శ్రీనివాసరావు, జివి జనార్దనరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

బేబినాయన ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఏడో వార్డులో గురువారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. రెండు దశాబ్దాలుగా ప్రజా సేవ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. అభివృద్ధిలో వైసిపి విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబర్కి శరత్, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ఉండేందుకు తామున్నామంటూ పోలీసులు ప్రజలకు ఈ కవాతు ద్వారా ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా పట్నంలోనే అన్ని వీధులలో పార మిలటరీ ద్వారా కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎస్.కె ఫక్రుద్దీన్, పోలీస్ బలగాలు పాల్గొన్నాయి.

శిశుమరణాలు తగ్గించేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - సీతానగరం

శిశుమరణాల రేటు తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని ఎంపిడిఒ ఎం. ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైద్య సిబ్బంది, అంగన్వాడి, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు మరణాలు, శిశు మరణాలు రేటు తగ్గించేందుకు ముందస్తు చర్యలో భాగంగా అన్ని శాఖలు ముందుగా గుర్తించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనత లోపించకుండా చూసేందుకు ఆ సమయాలలో వారికి సూచనలు సలహాలు అందించాలన్నారు. దీంతోనే శిశుమరణాల రేటు తగ్గుతుందని అన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు ఎం. రాధాకాంత్, టి. పావని, ఎపిఎం ఆర్ శ్రీరాముల నాయుడు, అంగన్వాడి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో ఎంపిడిఒ సమావేశం

గరుగుబిల్లి : విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సూర్యనా రాయణ, ఇఒపిఆర్‌డి గోపాల్‌రావు మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడు తూ 8శాతం గ్రంథాలయ పన్ను అందరూ గ్రంథాలయ నిధులకు జమ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, గరుగుబిల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనపై అవగాహన

భామిని : మండలంలోని బత్తిలి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.దామోదరరావు ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియా నివారణకుపై మనుమ కొండలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సికిల్‌సెల్ ఎనీమియా జన్యు సంబంధ వ్యాధి అని, రాబోయే తరాలకు ఈ వ్యాధి సోకకుండా ఏ అంశాలు పాటించాలి, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దేశం మొత్తం 2047కి పూర్తి స్థాయిలో ఈ వ్యాధి నిర్మూలించాలని ఈ అవగాహన కార్యక్రమాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశవ ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ హెచ్చరించారు. తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్కడ ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే కంట్రోల్ రూమ్‌కు పిర్యాదు చేస్తే వెంటనే సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంటింటి ప్రచారం చేయడానికి కూడా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కోరారు. ప్రతి పర్మిషన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి పొందాలన్నారు. నోడల్ అధికారులుగా అన్ని శాఖల నుంచి నియమించామని చెప్పారు. 19 కేటగిరీలు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లౌడ్ స్పీకర్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ స్థలంలో జెండాలు, ఫ్లెక్సీలు కడితే స్థల యజమాని అంగీకార పత్రంతో అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.10 వేలు కంటే ఎక్కువ మెటీరియల్ తరలించినా, రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లినా సీజ్ చేస్తామన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలి

ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం ఎన్నికల కోడ్ అమలుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనపై నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు.

రామభద్రపురం : రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎంపిడిఒ ఈశ్వరమ్మ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ సులోచనారాణితో కలిసి గురువారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ పార్టీలు గ్రామాల్లో నిర్వహించే సమావేశాలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్లపై రాజకీయ పార్టీ జెండాలు, హోర్డింగులు, ఫ్లెక్సీలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

చదువులో వెనుకబడిపోయామన్న ఆత్మన్యూన్యతా భావంతో బుధవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న బిటెక్ విద్యార్థి కొల్లూరు తారకేశ్వరరావు (16) సంఘటన మరువక ముందే పార్వతీపురంలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పట్టణంలోని 24వ వార్డు కోడిగుడ్ల వీధికి చెందిన నాడెం ఈశ్వరరావు, జగదీశ్వరి కుమారుడు నాడెం సురేష్ పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షల్లో అనుకున్న విధంగా రాయలేదనే మనస్తాపంతో తరచూ తల్లితండ్రుల దగ్గర బాధపడుతూ ఉండేవాడు. గురువారం మధ్యాహ్నం పాల వ్యాపారం చేస్తున్న తన తల్లిదండ్రులు బయటకు వెళ్లగానే తన ఇంట్లోనే ఫ్యాన్ రాడ్డుకు చున్నీ బిగించుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు తీసేసరికి రాడ్డుకు వేలాడుతూ విగతజీవిలా ఉన్న కుమారుడ్ని చూసి హతాసులయ్యారు. పోలీసుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సంతోషి కుమారి ఘటనపై వివరాలు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. తండ్రి పాల వ్యాపారం చేస్తుండగా, తల్లి ప్రయివేట్ పాఠశాలల్లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్నారు.

శాటిలైట్ తయారీకి సాంకేతిక సహకారం

సీనియర్ శాస్త్రవేత్త దుర్గాప్రసాద్



డాక్టర్ దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న విసి ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

శాటిలైట్ తయారీకి విద్యార్థులు ముందుకు వస్తే తన వంతు సాంకేతిక సహకారం అందిస్తానని అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కరణం దుర్గాప్రసాద్ భరోసా ఇచ్చారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మిషన్ టు దిమూన్ - సాంకేతికత, అవకాశాలు, సవాళ్లుఅనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీలో ఇంటర్న్ షిప్, ప్రాజెక్టులు, ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. చంద్రుని ఉపరితల వాతావరణంలో వివిధ ఉష్ణోగ్రతల మార్పులు కనగొనేందుకు ఉపకరించే పరికరాన్ని కనుగొనడంలో ఆయన కీలక పాత్ర పోషించిన విషయం గురించి వివరించారు. డాక్టర్ దుర్గాప్రసాద్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి డీన్ డాక్టర్ పిఎస్‌వి రమణారావు, డీన్ డాక్టర్ సన్నీ డయాల్, ఎఫ్‌సిఇ. విభాగాధిపతి జోగినాయుడు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

పార్టీని వీడితే నష్టమేమీ లేదు

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

కొందరు డబ్బులకు, పదవులకు ఆశపడి పార్టీని వీడినంత మాత్రాన వచ్చే నష్టమేమీ లేదని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. ఏ ఒక్కరు పార్టీని వీడినా ఆ స్థానాన్ని భర్తీ చేసే విధంగా స్థానిక నాయకులు కషి చేయాలన్నారు.. రానున్న ఎన్నికల్లో గెలుపుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. గురువారం స్థానిక బెల్లాన కన్వెన్షన్ లో గజపతినగరం, దత్తిరాజేరు మండలాల ముఖ్య నాయకులతో విస్తృ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఖాయం అనే అలసత్వం వహించవద్దని, ప్రతి ఒక్కరూ శ్రమించాలని అన్నారు. గ్రామాల్లో నాయకులు మధ్య ఉన్న చిన్న చిన్న విభేదాలను పక్కనపెట్టి సమిష్టిగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తేనే మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేయగలుగుతామనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే మన గెలుపునకు బలమైన పునాదిగా పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ఓట్లు తక్కువ వచ్చిన బూతులపై దృష్టి పెట్టాలన్నారు. పార్టీలో కొత్తగా చేరే వారిని వ్యతిరేకించవద్దని, ఎవరు స్థానం వారికి ఉంటుందని హితబోధ చేశారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ, మళ్లీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరు తమ శక్తివంచన లేకుండా పాటుపడాలన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు బొత్స సాయి గురు నాయుడు, జెడ్‌పిటిసిసభ్యులుగార తౌడు, రౌతు రాజేశ్వరి, ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు, మాజీ ఎంపిపి కంది తిరుపతి నాయుడు, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, ఎఎంసి ఛైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి నారాయణ మూర్తి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, నాయకులు కరణం ఆదినారాయణ, మండల సురేష్, బెల్లాన త్రినాధరావు, కృష్ణార్జులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



వేపాడ.. అవగాహన కల్పిస్తున్న వైద్యులు ధరణి

టిబి రహిత సమాజమే ధ్యేయం

ప్రజాశక్తి-వేపాడ

టిబి రహిత సమాజమే ధ్యేయమని వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి తెలిపారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో క్షయవ్యాధి నిర్మూలన సంబంధిత అంశాలతో వాల్‌పోస్టర్‌ను ధరణి ఆవిష్కరించారు. క్షయ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : వియ్యంపేటలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపల్ టి. జయశ్రీ ఆధ్వర్యంలో సీతంపేటలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, హెచ్ఎస్ ఈశ్వరరావు, స్టాఫ్ నర్స్ దీప, ఎంఎల్‌హెచ్‌పి కామేశ్వరి, ఎఎన్ఎం భవాని, జ్యోతి పాల్గొన్నారు.

కార్యకర్తలూ.. అధైర్య పడొద్దు

ప్రజాశక్తి-బొండపల్లి

కార్యకర్తలు అధైర్య పడొద్దని, కష్టనష్టాలలో అండగా ఉంటామని ఎం.కొత్తవలస గ్రామ కార్యకర్తలకు వైసిపి ప్రజా ప్రతినిధులు భరోసా ఇచ్చారు. మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో ఎంపిటిసి కర్రోతు లక్ష్మీనారాయణ అధ్యక్షతన వైసిపి కార్యకర్తల ఆత్మీయ భరోసా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి చల్ల చలంనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహకారంతో సర్పంచ్ శ్రీనువాసరావు కోట్లాది రూపాయలతో అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎం.కొత్తవలస గ్రామంలో చేపట్టామని తెలిపారు. సర్పంచ్ శ్రీనివాసరావు నాయకులను, కార్యకర్తలను మోసం చేసి వైసిపి నుండి టిడిపిలో చేరారని విమర్శించారు. జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ రావు, పిఎసిఎస్ అధ్యక్షులు బివి.ప్రభాజీ మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తమతోపాటు ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారని భరోసాఇచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, నియోజక వర్గ గృహసారథుల కన్వీనర్ ఈదిబిల్లి కృష్ణ, మండల కన్వీనర్ పల్లి రఘు, మాజీ సర్పంచ్‌లు కర్రోతు జనార్ధన రావు, వేమలి వెంకటరావు, సాలాపు పెంటంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాయుడు కాలనీలో కల్వర్టులు నిర్మించండి

ప్రజాశక్తి-బొబ్బిలి



కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయుడుకాలనీ వాసులు

మున్సిపాలిటీలోని నాయుడు కాలనీలో కల్వర్టులు నిర్మించాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మిని న్యాయవాది పోల అరుణ్ కుమార్, కాలనీ ప్రజలు కోరారు. నాయుడు కాలనీలో గురువారం పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కాలనీలో కల్వర్టులు లేకపోవడంతో మురుగునీరు, వర్షాలు కురిస్తే వరదనీరు వెళ్లడం లేదని స్థానికులు కమిషనర్‌కు వివరించారు. దీంతో ఇళ్ల ముందే నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కల్వర్టులు నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో గుర్ల తమ్మిరాజుపేటలో గురువారం ఎల్లమ్మతల్లి జాతర సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్. సన్యాసినాయుడు, కొండమ్మ దంపతులు ప్రారంభించారు. ఈ పోటీలకు పి.శ్రీరాములు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రేగిడి.. మాట్లాడుతున్న పిఒ కనకదుర్గ

ప్రజాశక్తి- రేగిడి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని రాజాం ఐసిడిఎస్ పిఒ కనకదుర్గ అన్నారు. ఈ మేరకు గురువారం పోషణ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా లచ్చారాయపురం అంగన్వాడి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ముందుగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సంబంధించి పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాలు ఇచ్చిన పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిఒతోపాటు అంగన్వాడి సూపర్‌వైజర్ శశికళ, హెచ్ఎం హేమలత, లెంక నారాయణరావు, కార్యకర్త నాగమణి ఉన్నారు.

బొబ్బిలి : అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని పాకీవీధి, మండలంలోని పక్కిలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సీతానగరం: మండలంలోని బూర్జ కృష్ణరాయపురం, వెంకటాపురం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను గురువారం సెక్టోరియల్ ఆఫీసర్, ఇఒపిఆర్‌డి కేకే వర్మ, ఏఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, మౌలిక వసతులపైన అన్ని కేంద్రాల బిఎల్ఒలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్థానిక తహశీల్దార్ సీతారామయ్య బిఎల్ఒలను ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో మండల పరిధిలో గల 59 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బిఎల్ఒలతో సమావేశం ఏర్పాటు చేశారు. అలాగే ఎన్నికల కోడ్ నిబంధనను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ బాలభాస్కరరావు

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు, చామలాపల్లి, కరకవలస పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కరకవలసలో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల ట్రైల్స్ వర్క్‌ను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.